"ఇందాకటి నుంచి ఎందుకు రాలేదు? ఆ విషయం ఎందుకు చెప్పలేదు? ఏంచేస్తున్నారు?" ఒక్కొక్క చూపులో వాడిబాణాలు విడుస్తోంది. కదలికలో వయ్యారం ఉట్టిపడుతోంది. మాటలు తీవ్రంగాఉన్నా, హాయిగాఉన్నాయి. రంగా ఆగలేక పోతున్నాడు. సంభాషణ వింటున్నాడు. భావపరంపరలు హృదయంలో విజృంభిస్తున్నాయి.

డ్రైవర్ ఏదో నసుగుతున్నాడు. "రిక్షా ఏదన్నా చూడు." ఆర్డర్.

డ్రైవర్ మామూలు రిక్షా తెచ్చాడు. "అన్ని రిక్షాలు అయిపోయాయి. సైకిల్ రిక్షా కూడా దొరకలేదు..." ఇహ మాట్లాడలేదు.

ఎక్కిందా నరవాహనం.

"నేనా కారుదగ్గర ఉంటానమ్మా!" ఆగాడు డ్రైవరు.

జీప్సీ వెంట పడ్డాడు రంగా. రిక్షా వెంటపడి ఆవిడను యింటిదాకా సాగనంపాడు.

దిగింది రిక్షా. రిక్షావాడిచేతులో రూపాయి పెట్టింది.

"పెట్టి పుట్టింది" అనుకున్నాడు రంగా.

వీధిలైట్ల కాంతిలో తళుక్కున మెరిసింది తన్వి ముఖం. తనివి తీరా చూచి రెండు లొట్టలేసాడు.

"అబ్బ! జన్మ తరించింది." అనుకున్నాడు.

అలాంటి అప్సరసను తానంత వరకు చూడలేదు.

జీప్సీ తుర్రున ఇంట్లోకి దూరింది.

అలవాటు ప్రకారం బీడీకోసం జేబులు తడుముకున్నాడు రంగా.

# అక్క — చెల్లెలు

ఇచ్ఛాపురపు జగన్నాథరావు

ఆదివారం. పూర్తి సెలవు. ఇంకేమీ చెయ్యడానికి లేక శ్రీపతిదగ్గరకి బయలుదేరాను-వాళ్ళావిడ వచ్చివుంటే మంచి కాఫీ అయినా పోస్తుందని. గవర్నమెంటుకి కాఫీమీద కోపం వచ్చాక మా అయ్యరు కాఫీలో చింతపొడి కలిపేస్తున్నాడు. ఇంటి కాఫీ కూడా ఒక కాఫీయేనా అని-పైన తాగక తప్పదు.

గుమ్మం దాటేసరికి శ్రీపతి కలం పట్టుకుని కాగితం ముందు పెట్టుకుని ఆలోచిస్తున్నాడు. కథ రాసే ప్రయత్నం. అనుకున్నాను.

"రారా భాయ్...సిటీబస్సుల్లే బుర్ర అంతా ఆలోచనలతో క్రిక్కిరిసిపోయింది. బస్‌స్టాప్ వస్తేకాని అందులో పేసింజర్లు దిగరు-ఇన్స్పిరేషన్ వస్తేగాని మన బుర్రలోంచి కథ ఊడిపడదు. బస్‌స్టాప్ ఎలా అయినా వస్తుందిగాని మనకి ఇన్స్పిరేషన్ రావటంలేదు" అన్నాడు గుక్కతిప్పకుండా.

"నే వచ్చాగా...అయినా అన్ని కథలు తిరిగొచ్చినవి వుండగా అడ్రస్ మార్చక కొత్త కథలెందుకురా?" అన్నాను-ఈమధ్య నా కథలూ వాడి కథలూ మహాజోరుగా తిరిగొస్తున్నాయి.

"కథ రాయడంలేదురా?" అన్నాడు వాడు.

"గేయమా?"

"అదీ కాదురా. శ్రీమతికి ఉత్తరం రాస్తున్నాను."

నవ్వాను-"దానికింత ఆలోచన ఎందుకురా? అయితే ఆవిడ దిగలేదన్నమాట. ఇవాళ మంచి కాఫీ తాగుదామనుకున్నాను. అయినా, ఆంధ్ర రాష్ట్రమల్లే వస్తాను వస్తాననడమేగాని, రావడం కనిపించదు. మిస్‌ఫార్చ్యూన్ భాయ్" అన్నాను.

"నీకేం? నువ్వేమన్నా చెప్తావు-నా బాధ నీకేం తెలుసు? ఛస్తూంటే."

"ఒరేయ్-ఆవిడ దిగిందంటే నీకింక మళ్ళా కరచరణాలు బంద్...నా మాట విని, ఈ స్వేచ్ఛని సెలిబ్రేట్ చెయ్యి. అంటే లోపలికివెళ్ళి మంచి కాఫీ చేసి పట్రా. ఈ లోపల నిన్న తిరిగొచ్చిన కథ ఏదన్నా ఇయ్యి. చూస్తూంటాను" అన్నాను.

వాడి పెళ్ళాం మళ్ళా సెలవు ఎక్స్టెండ్ చేసింది. ఆవిడ కేంపు వేశాక మావాడు పదకొండు కథలూ, నాలుగు గేయాలు-మొత్తం నూట డెబ్భయి పేజీలు రాశాడు. పన్నెండు పేజీల కథ ఒకటి అచ్చయింది. మిగిలినవి

మద్రాసు దాకా వెళ్ళి 'నిన్ను వీడి నిలువజాలా' అంటూ వెనక్కొచ్చాయి. ఇంత చక్కగా సాహిత్యసేవ చేసుకుంటూన్న వీడికి ఆవిడగురించి అంత తొందరెందుకో?

మావాడు కాఫీ తెచ్చి ఇస్తూ "మదరాసు నుంచి కావ్య కన్యకలు నాలుగు రోజులలో తిరిగి వస్తున్నారు...కాని ఒక్క కథపాటి చురుకుదనం లేదీవిడకి" అన్నాడు.

కాఫీ తాగుతూంటే నాకో ఉపాయంతట్టింది.

"ఈ మాన్యుస్క్రిప్టులన్నీ కట్టికట్టి పంపు. నీకు పిచ్చెత్తిందోమోనని ఆవిడ మూడో రోజు కల్లా తిరిగొస్తుంది. నీ కథల ఎఫెక్టు చాలక పోతే నావీ ఇస్తాను" అన్నాను.

"లాభంలేదు భాయ్-మా మరదలు వాటన్నిటినీ తిప్పిరాసి, తన పేర అచ్చేయించుకుంటుంది" అన్నాడు.

"రచయిత్రా?" అన్నా.

"ఆఁ. ఆవిడ 'ప్రేమ' అని కథలు రాస్తుంది" అన్నాడు.

"చదివిందా?"

"గ్రాడ్యుయేటు - ఐస్‌క్రీమ్‌లా ఉంటుంది" అన్నాడు. నోరూరింది "పెళ్ళయిందా?" అన్నాను.

వాడు నవ్వి "నిన్నుమాత్రం చేసుకోదులే. ఇంకా పెళ్ళి కాలేదు" అన్నాడు.

"ఆమధ్య నీ మరద లెవరికో పెళ్ళి నిశ్చయం అయిందన్నావు?"

వాడు నవ్వి "ఈవిడే. ఆ కథ చాలా ఉంది మా ఆవిడ నిన్న ఉత్తరంలో రాసింది. కాఫీ కానీ. చెప్తాను" అన్నాడు.

* * *

వసంత-వీడి మరదలు-బి. ఏ. చదువుతుండగా ఓ అబ్బాయితో స్నేహం చేసింది.

ఆ ఇద్దరి పరిచయమూ చాలా పద్ధతిగా రిజ గింది. ఒకనాడు వసంత వస్తూంటే ఒక సైకిలు ఆమెను ఢీ-కొన్నంతపని అయింది. అతను ధైర్య సాహసాలుచూపి, ఆ సైకిలుమీద ఉరికి, ఒక్క అర్ధణా అంతవాసిలో ఆ అమ్మాయిని రక్షించాడు.

"థ్యాంక్యూ" అని లియ్యగా అని వసంత తన రక్షకుడినిగురించి తెలుసుకోడంకోసం వెను దిరిగి చూసింది. తన క్లాస్‌మేట్, రాజు. చాలా ఆశ్చర్యపడి, "చాలా ప్రమాదంనించి తప్పించారు. ఎలాగు కృతజ్ఞత చెప్పకోవాలో తెలీకుండా వుంది" అంది. "ఆఁ, దానికేంలెండి. ఈ మాత్రం దానికి అంతగా పొగడాలా?" అన్నాడు అబ్బాయి-అవసరం ఉంటే సైకిల్నేమిటి, రైలునే ఆపేస్తాను-అన్నట్లు.

"రేపు మా ఇంటికి టీకి రండి" అనికోరింది వసంత. టీ చక్కని పానీయము అని.

"థాంక్స్" అన్నాడతను.

తరువాత ఎవళ్ళ మానాన వాళ్ళు వెళ్ళిపోయారు. వసంత హృదయంలో ఏవో అవ్యక్తమైన భావాలు ప్రవేశించి, పార్లమెంటులో కమ్యూనిస్టులల్లే అల్లరిచెయ్యడం ప్రారంభించాయి.

మర్నాడు రాజువచ్చేసరికి పాండ్సు అడ్వర్టైయిజ్‌మెంట్లల్లే అలంకరించుకుని తయారైంది వసంత. రాజుకూడా తక్కువ చెయ్యలేదు. ఆ తొలిరాత్రి అంతా ఆమెనితల్చుకుంటూ, ఏమో తెలియని బాధలు అనుభవించాడు. చెప్పొచ్చేదేమిటంటే, లవ్ అట్ ఫస్ట్ సైట్ ముంచుకొచ్చింది, సెకండ్ సైట్ ఇంక వాళ్ళకి లేదు. ఎందుకంటే లవ్ ఈజ్ బ్లైండ్. ఆ సెకండ్ సైట్ ఉంటే ఎప్పుడూ ప్రేమించే ఉండడంటాడు వైల్డు.

ఇంక వీళ్ళు బీచ్‌లో కలుసుకోవడం సాగించారు. విత్తనంవేశాక మొక్కలాగ, ఇరుగు పొరుగుల దెబ్బలాటలాగ వీళ్ళ ప్రేమ దినదినాభివృద్ధి-కర్మం అదేం? నిముషనిముషాభివృద్ధిచెందింది. వసంతకి చంద్రుడన్నా, పువ్వులన్నా ఇతర ప్రేమ వస్తువలన్నా ఎక్కడలేని అభిమానం పుట్టుకొచ్చింది. తరుచుపాటలు పాడేది-ఏలతా, రఫీల డ్యూయెటొలోనోలతావంతుమాత్రం పాడేది.

కొన్నాళ్ళకి వీళ్ళప్రేమ బలసి మహారణ్యం అయిపోయింది. అందులో వీళ్ళకొక్కమార్గం మాత్రమే కనిపించింది-పెళ్ళిచేసుకోవడం. అందుకని, ఆ అబ్బాయి ఒకనాడు ఆమెముందు మోకరించి, "ఓ ప్రణయాధి దేవతా! నా జీవితం అనే అంధకార బంధురమార్గంలో ఎవ్రెడీ టార్చి సెల్సూ ఎవరెడీ టార్చి లైటూలాగ మనం ఇద్దరం కలిసి, ఈ చీకట్లనిదూరంచేద్దామా?" అని

అన్నాడట. (ఈ మాటలన్నీ పొరపాటున వసంత తల్లికి వినిపించి, ఆవిడ భర్తనడిగిందట. ఈ అఘాయిత్యం ఏమిటండీ? అని. ఆయన ముసిముసిగా నవ్వి, "దాన్ని ప్రపోజ్ చెయ్యడం అంటారు. అంటే ఆ ఇద్దరూ పెళ్ళిచేసుకుంటారు అన్న మాట" అని చెప్పగా ఆవిడ సంబరపడిందట.)

తరువాత వ్యవహారం అంతా చాలా రహస్యంగా జరిగింది. వసంతా అతనూ ఓరోజున లేచిపోయి పారిపోయి స్వేచ్ఛా వాయువులు పీల్చుద్దామని నిర్ణయించుకున్నారు. ప్రేమ అంటే తెలియని ఈ గుడ్డిలోకం కళ్ళుకప్పేద్దామనుకున్నారు.

కాని ఈలోగా ఒక గమ్మత్తు జరిగింది. వసంత తండ్రి ఒకనాడామెని పిలిచి, "అమ్మాయి, నీకు పెళ్ళీడు వచ్చింది" అన్నారు.

సినిమా నాయికలాగే శక్తున్నంతవరకూ తల వంచుకుని నిలబడిందా అమ్మాయి.

కాని, గొప్పఘాతం, వజ్రాఘాతం ఏమిటి అన్నట్టు ఆటమ్ ఆఘాతం తరవాతే వచ్చిపడ్డది. ఆయన అన్నారు కదా, "రాజు నీకూ నచ్చాడనుకుంటాను. వాళ్ళ నాన్నగారూ అమ్మకూడా అంగీకరించారు. ఇంక నువ్వు ఊఁ అంటే అయిపోతుంది" అని.

వసంత కళ్ళమ్మట నీరు పెట్టేసింది. వాళ్ళమ్మ భుజాన్ని కౌగలించుకుని, "ఈ పెళ్లి వద్దని చెప్పవే!" అని ఏడ్చేసింది.

"దానికంత ఏడుపెందుకే? అలాగే నూనేస్తాలే. నీకిష్టమనుకున్నాను" అన్నాడా ముసలాడు విస్తుపోయి.

వసంత ఇంకా ఏడ్చేసింది.

ఆ సాయంత్రం మొహం హిందూ పేపరంత చేసుకుని రాజు వచ్చాడు. తిన్నగా వసంత దగ్గరకి వెళ్లి, "సంఘం మన ప్రేమని గుర్తించింది చూశావా?" అన్నాడు.

ఆ అమ్మాయి ఏడుస్తూనే ఉంది ఇంకాను.

"ఈ సంతోష సమయంలో కన్నీరెందుకు సఖీ!" అన్నాడు రాజు మహాశ్చర్యంతో.

ఆ అమ్మాయి మాట్లాడలేదు. కొంచెంసేపుండి, "పో!" అంది.

"నన్నేనా?" అన్నాడతను.

"నిన్నే. వెంటనే పో" అంది మళ్ళా వసంత.

అతను పోయాడు. తరవాత వసంత ఈ పెళ్లి వద్దన్నదని విని అతనూ చాలా ఆశ్చర్యపడ్డాడు. ఏమయితేనేం, పెళ్లి డ్రాప్ చేశారు.

* * *

అంతదాకా తెలియజేసి శ్రీపతి సిగరెట్ ముట్టించి నాకోటి దానంచేశాడు. 'అంతదాకా వచ్చి ఆ అమ్మాయి పెళ్ళెందుకొద్దందిరా?" అని అడిగాను.

వాడు పొగ వదుల్తూ, "అదే తెలీలేదు. ఇన్నాళ్ళనించీ అది ఒకమిస్టరీగా ఉండిపోయింది గెస్ చెయ్యి" అన్నాడు.

"సీల వదులైందేమో!" అన్నాను.

వాడు నవ్వి ఊరుకున్నాడు. నా ఆలోచనలతో నేను బాధ పడుతూంటే వాడే మొదలెట్టి, "మా ఆవిడతో ఇందులోని రహస్యం చెప్పిందిరా వసంత" అన్నాడు.

"ఏమిటది?"

వాడు మాట్లాడలేదు. అదంతా సస్పెన్సు క్రియేట్ చెయ్యడానికి. అందుకే వాడి కథలట్లా ఏడుస్తాయ్.

"ఆ అమ్మాయి చాలా నవలలు చదివింది. అన్ని సినిమాలూ చూసింది" అని, వాడు మళ్ళా ఆపాడు.

"నువ్వు అసలు సంగతి చెప్పకపోతే నేను ఆ ఉత్తరం చూస్తాను" అన్నాను.

"అదేం వద్దులే. కాని, ఉన్న సంగతేమిటంటే ఆ వసంత ప్రేమంతా ప్రేమకోసం కాదు. దానిలోని థ్రిల్ కోసం. లేచిపోదామనుకోడం అందుకే. తీరా అంతా వివాహంకోసం అంగీకరించేసరికి- ఇంకేముంది వ్యవహారం చప్పబడ్డది. ఆ అమ్మాయికి రుచించలా" అన్నాడు శ్రీపతి-వీడే ఆమిస్టరీ సాల్వుచేసిన పోజువేసి.

ఇంక ఎవళ్ళమూ మాట్లాడలేదు. సిగరెట్ అయిపోయింది. ఒక్కసారి ఎన్నో వందల మైళ్లు వెనక్కి విసరబడినట్లయింది నాకు. వాడు కాగితము కలంతీసుకుని శ్రీమతికి లేఖ రాస్తున్నాడు.

ఆవిడ ఎందుకు తిరిగి రావడం లేదో అర్థమైంది-నాకు. మనసులోనే ఉంచుకుని, నవ్వుకున్నాను.